క్లుప్తంగా

అనుమతులు మంజూరు హర్షణీయం


డీవీజీ శంకరరావు

విజయనగరం: జిల్లాలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలకు జాతీయ వైద్యమండలి అనుమతులు మంజూరు చేయడం హర్షణీయమని మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంవత్సరమే 150 మంది విద్యార్థులతో ప్రారంభం కానున్న కళాశాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోందని పేర్కొన్నారు. జిల్లాలో వైద్య కళాశాల ఏర్పాటు చేసిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

పౌష్టికాహారం తప్పనిసరి


క్షయరోగికి పౌష్టికాహారం అందజేస్తున్న సత్యం

విజయనగరం ఫోర్ట్: క్షయ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని రెడ్‌క్రాస్ కార్యదర్శి సత్యం అన్నారు. బుధవారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో క్షయ వ్యాధిగ్రస్తులకు రాగి పిండి, కంది పప్పు, నూనె, వేరుశనగపప్పు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోగులు క్రమం తప్పకుండా మందులు వాడుతూ, పౌష్టికాహార తీసుకోవడం వల్ల త్వరగా ఆరోగ్యవంతులవుతారని చెప్పారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ ప్రతినిధులు గౌరీశంకర్, సత్యారావు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

పైడితల్లి ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు


నగదు లెక్కిస్తున్న అధికారులు

భోగాపురం: పోలిపల్లిలో కొలువైన పైడితల్లి అమ్మవారికి భక్తులు సమర్పించిన హుండీ ఆదాయాన్ని దేవదాయ శాఖ ఈఓలు డీవీవీ ప్రసాదరావు, కె. శ్రీరామ్, ఆలయ కమిటీ చైర్మన్ కర్రోతో పైడిరాజు ఆధ్వర్యంలో బుధవారం లెక్కించారు. సుమారు 11 నెలల కాలానికి హుండీల ద్వారా 3,39,316 రూపాయల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కర్రోతు వెంకటరమణ, మాజీ ఉప సర్పంచ్ పతివాడ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

యాదవులకు సముచిత స్థానం


మాట్లాడుతున్న గదుల వెంకటరావు

విజయనగరం పూల్‌బాగ్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి యాదవులకు సముచిత స్థానం కల్పించడం హర్షణీయమని అఖిల భారత మహాసభ జిల్లా అధ్యక్షుడు గదుల వెంకటరావుయాదవ్ అన్నారు. ఎమ్మెల్సీగా శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఎస్. రామారావుకు అవకాశం ఇవ్వడం గొప్ప విషయమన్నారు. బుధవారం స్థానిక కోరాడవీధిలో గల సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు.

సమాచారం అందించడంలో మహిళా పోలీసులే కీలకం

● టూటౌన్ సీఐ లక్ష్మణరావు

విజయనగరం క్రైమ్: పోలీస్ అధికారులకు క్షేత్రస్థాయి సమాచారం అందించడంలో మహిళా సంరక్షణ పోలీసులదే కీలకపాత్ర అని టూటౌన్ సీఐ సీహెచ్ లక్ష్మణరావు అన్నారు. రెండురోజుల కిందట పోక్సో కేసులో నిందితుడ్ని పట్టించడంలో కీలకపాత్ర పోషించిన ఎంఎస్‌పీ దాసరి భవానీని బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళా సంరక్షణ పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో టూటౌన్ పోలీసులు, మహిళా సంరక్షణ పోలీసులు పాల్గొన్నారు.

కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలి

రేగిడి: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల గురుకులాల సమన్వయాధికారి బి.చంద్రావతి అన్నారు. మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. పదో తరగతి, ఇంటర్ విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులకు కోట్లాది రూపాయిలు ఖర్చు చేస్తోందని, ప్రతి విద్యార్థి చక్కగా చదువుకొని భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల భోజన వసతి, గురుకులం పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

మురుస్తున్న పెద తాడివాడ..



రీవీగా దర్శనమిస్తున్న రైతుభరోసా కేంద్రం



వెల్‌నెస్‌సెంటర్ భవనం



పెదతాడివాడ గ్రామ సచివాలయ భవనం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సృష్టించిన గ్రామ సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతోంది. ప్రజలకు గ్రామస్థాయిలోనే సేవలు అందించాలన్న మహోన్నత లక్ష్యంతో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేశారు. గ్రామాల్లో కోట్లాది రూపాయల వ్యయంతో సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ల భవనాలు నిర్మించారు. ఇందులో భాగంగా మండలంలోని పెద తాడివాడలో అధునాతన భవనాలు నిర్మించారు. ఒకప్పుడు ఎన్నో సమస్యలతో సతమతమయ్యే గ్రామంలో నేడు సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు కావడంతో ప్రజలందరికీ అన్ని రకాల సేవలు అందుతున్నాయి. సచివాలయ సిబ్బంది కూడా తెలియజేసిన సమస్యలను రోజుల వ్యవధిలో పరిష్కరిస్తున్నారు. ఇళ్ల ముంగిటకే ప్రభుత్వ పాలన తీసుకువచ్చిన సీఎం జగనన్నకు గ్రామస్తులు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

– డెంకాడ

సీతంరాజుకు అండగా బ్రాహ్మణ సమాఖ్య


ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్‌ను అభినందిస్తున్న జిల్లా బ్రాహ్మణ సమాఖ్య ప్రతినిధులు

● సమాఖ్య జిల్లా అధ్యక్షుడు టీవీ శ్రీనివాస్

విజయనగరం టౌన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు బ్రాహ్మణ సమాఖ్య అండగా ఉంటుందని సమాఖ్య జిల్లా అధ్యక్షుడు టీవీ శ్రీనివాస్ అన్నారు. సుధాకర్ నామినేషన్ వేసిన సందర్భంగా సమాఖ్య సభ్యులు బుధవారం ఆయన్ని కలిసి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రధాన కార్యదర్శి గన్నవరపు శ్రీనివాస్, కట్టమూరి చంద్రశేఖర్, వీఎస్ఎన్.కుమార్, అధికారుల శ్రీనివాస్, వాడ్రేవు శ్రీనివాసరావు, అర్చక పురోహిత సంఘ అధ్యక్షుడు భమిడిపాటి రామ్‌కుమార్ శర్మ, మురళి, చంద్రశేఖర్, శాస్త్రి, సరిపల్లి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సాయికృష్ణ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న నూతన కమిటీ ప్రతినిధులు

విజయనగరం: సాయికృష్ణ వాకర్స్ క్లబ్ నూతన కార్యవర్గ ఎన్నిక కణపాకలోని ఉమామహేశ్వర కమ్యూనిటీ హాల్‌లో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 102 క్లబ్ గవర్నర్ కర్రోతు సత్యం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికలో నూతన అధ్యక్షుడిగా చెల్లూరి శ్రీనివాసరావు, కార్యదర్శిగా కోట్ల సత్యనారాయణ, కోశాధికారిగా జి.గోవిందరావు, తదితరులు ఎంపికయ్యారు. కార్యక్రమంలో క్లబ్ మాజీ అధ్యక్షుడు పతివాడ నారాయణరావు, ఏరియా కో ఆర్డినేటర్ కృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

విజయనగరం అర్బన్: నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బలగ శుభ మాట్లాడుతూ, మాతృభాష ద్వారా గౌరవ మర్యాదలు సులువుగా వ్యక్తపరచవచ్చన్నారు. దేశ భాషలుగా గుర్తించబడిన 22 భాషల్లో విద్యార్థులు వీలున్న భాషలు నేర్చుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సంస్కృత కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గౌరీశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ బలగ శుభ

పావల్‌కు ఘన నివాళులు..


రోగులకు పండ్లు, రొట్టెలు అందజేస్తున్న నిర్వాహకులు

నెల్లిమర్ల: స్కౌట్ ఉద్యమ వ్యవస్థాపకుడు బేడన్ పావల్ 166వ జయంతి సందర్భంగా ఆలోచన దినోత్సవాన్ని నెల్లిమర్ల పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆదిత్య విద్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కళాశాలకు చెందిన సర్దార్ వల్లభాయ్ పటేల్, ఝాన్సీ లక్ష్మీబాయి ఓపెన్ స్కౌట్ యూనిట్ల ఆధ్వర్యంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. వైద్యాధికారులు సుబ్రహ్మణ్యం హరికిషన్, శ్రీనివాసరావు స్కౌట్స్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్కౌట్ మాస్టర్ వి సూరిబాబు, పాఠశాల హెచ్ఎం వి. అమృత, తదితరులు పాల్గొన్నారు.

మందుల పంపిణీపై సంతృప్తి

గజపతినగరం రూరల్: ఫైలేరియా (బోదవ్యాధి),నులిపురుగుల నివారణకు సంబంధించిన డీఈసీ, అల్బెండ్‌జోల్ మాత్రల పంపిణీపై కేంద్ర వైద్య,ఆరోగ్య బృంద సభ్యులు డాక్టర్ జయరాం, డాక్టర్ నితిన్ సంతృప్తి వ్యక్తం చేశారు. గజపతినగరం మండలంలోని కొత్తబగ్గాంలో ఇంటింటికీ వెళ్లి ఫైలేరియా, నులిపురుగుల నివారణ మాత్రలను వైద్య సిబ్బంది పంపిణీ చేశారా లేదా అని ఆరా తీశారు. వైద్య సిబ్బంది మందులు అందజేశారని, వారి సూచనల మేరకు మాత్రలు వేసుకున్నట్లు ప్రజలంతా చెప్పారని అధికారులు తెలిపారు. వారి వెంట డీఎంఓ తులసి, ఏఎంఓ డి.వి.రమణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.


కొత్తబగ్గాంలో మందుల పంపిణీపై ప్రజలను ఆరా తీస్తున్న వైద్యబృందం

రాష్ట్రస్థాయికి 'పోలిపల్లి' ప్రాజెక్ట్

భోగాపురం: జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలో పోలిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికైంది. దీంతో విద్యార్థులను పాఠశాల ఆవరణలో బుధవారం అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా రాణించాలని హెచ్ఎం ఇందిరాదేవి ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైకేపీ కార్యాలయంలో ఆడిట్


ఆడిట్ నిర్వహిస్తున్న సిబ్బంది

నెల్లిమర్ల: స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం ఆడిట్ నిర్వహించారు. ఇంటర్నల్ ఆడిట్ డీపీఎం ఆదయ్య ఆధ్వర్యంలో నెల్లిమర్ల, గుర్ల మండలాలకు చెందిన గ్రామైక్య సంఘాల ఆడిట్ చేపట్టారు. ఇరు మండలాల ఏపీఎంలు ఎల్. సత్యనారాయణ, నారాయణరావు, సీసీలు, ఎల్‌సీలు, వీఓఏలు పాల్గొన్నారు.

లక్ష్మీ గణపతికి ప్రత్యేక పూజలు


వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు అవనాపు విక్రమ్, తదితరులు

విజయనగరం: పట్టణంలోని తూర్పు బలిజివీధిలో కొలువైన లక్ష్మీగణపతి ఆలయంలో 28వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు అవనాపు విక్రమ్, తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా విక్రమ్ మాట్లాడుతూ, కోరిన కోర్కెలు తీర్చే స్వామిని ప్రతిఒక్కరూ దర్శించి, తరించాలన్నారు. కార్యక్రమంలో 20వ డివిజన్ కార్పొరేటర్ కె.తవిటిరాజు, ఆలయ కమిటీ అధ్యక్షుడు రాయన నారాయణరావు, కమిటీ సభ్యులు, స్థానిక పెద్దలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఒంటరి విద్యార్థికి ఆర్థిక సహాయం


కామేష్‌కు నగదు అందజేస్తున్న శివప్రసాద్

చీపురుపల్లి: తల్లిదండ్రులు ఇద్దరినీ ఒకేసారి కోల్పోయి ఒంటరిగా మిగిలిన పట్టణానికి చెందిన నీలాతి కామేష్‌కు స్థానిక గాయత్రీ జూనియర్ కళాశాల విద్యార్థులు, యాజమాన్యం రూ.17 వేల ఆర్థిక సహాయం చేశారు. తల్లిదండ్రులను పోగొట్టుకుని అనాథగా మిగిలిన కామేష్‌పై ఈనెల 6న సాక్షి పత్రికలో 'ఒంటరినైపోయాను' శీర్షికతో కథనం వెలువడింది. దీనికి స్పందించిన గాయత్రీ కళాశాల కరెస్పాండెంట్ డి.శివప్రసాద్ విద్యార్థులు కలిసి కామేష్‌కు బుధవారం ఆర్థిక సహాయం చేశారు. కళాశాల కరెస్పాండెంట్ శివప్రసాద్ మాట్లాడుతూ కామేష్ తమ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకున్నాడని, తల్లిదండ్రులు కోల్పోయి అనాథగా మిగిలిన విషయాన్ని తెలుసుకుని సహాయం చేశామని చెప్పారు. భవిష్యత్‌లో కామేష్ చదువుకు ఎలాంటి సహకారం కావాలన్నా అందిస్తామని తెలిపారు.

వాలీబాల్ పోటీలు ప్రారంభం

రేగిడి: మండలంలోని కొమెర గ్రామంలో ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. షిర్డీసాయి మందిరం ప్రారంభోత్సవం సందర్భంగా వావిలపల్లి రామ్మూర్తినాయుడు మాస్టారు మెమోరియల్ ఉత్తరాంధ్ర వాలీబాల్ టోర్నమెంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ టోర్నీని పాలకొండ సీఐ కె.మురళీధరరావు, వంగర మాజీ ఎంపీపీ బొత్స వాసుదేవరావునాయుడు ప్రారంభించారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల నుంచి సుమారు 34 టీమ్‌లు పాల్గొన్నాయి. విజేతలకు 24న బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎమ్మెల్సీ సురేష్‌బాబుకు అభినందనలు


ఎమ్మెల్సీ సురేష్‌బాబుకు అభినందనలు తెలుపుతున్న నాయకులు


అభినందనలు తెలియజేస్తున్న క్షత్రియ సంఘ ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజుకు (సురేష్‌బాబు) పలువురు అభినందనలు తెలియజేశారు. ఎమ్మెల్యేల కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ అధిష్టానం తాజాగా ప్రకటించిన నేపథ్యంలో మొయిదలోని సురేష్‌బాబు స్వగృహానికి జిల్లా క్షత్రియ సంఘ ప్రతినిధులు, జరజాపుపేట, పూతికపేట, మొయిద, కొండగుంపాం, తదితర గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు వచ్చి అభినందనలు తెలిపారు. ఎమ్మెల్సీకి అభినందనలు తెలిపిన వారిలో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, దాట్ల సత్యనారాయణరాజు, మద్దిల వాసు, నల్లి చంద్రశేఖర్, నల్లి శ్రీను, నారాయణమూర్తి, మోహనరావు, పతివాడ అప్పారావు, ధవళ లక్ష్మణరావు, తదితరులున్నారు.

సత్వర చికిత్సపై శిక్షణ


శిక్షణ అందిస్తున్న ప్రొఫెసర్లు

నెల్లిమర్ల: పట్టణంలోని మిమ్స్ కళాశాలలో ప్రాణాపాయస్థితిలో ఉన్న రోగికి అందించాల్సిన చికిత్సపై జూనియర్ డాక్టర్లకు బుధవారం శిక్షణ ఇచ్చారు. ఎనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణలో భాగంగా ప్రమాదాల్లో ఊపిరాడక ఇబ్బంది పడే వారికి ఆక్సిజన్ ఎలా అందించాలనే విషయమై అవగాహన కల్పించారు. ప్రాణాపాయస్థితిలో అందించాల్సిన చికిత్సకు సంబంధించిన మెలకువలను వివరించారు. సత్వర చికిత్సపై గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని ఎనస్థీషియా విభాగాధిపతి డాక్టర్ డీవీజీ శంకరరావు సూచించారు. నైపుణ్య శిక్షకులు డాక్టర్ చైతన్య, డాక్టర్ భరత్, డాక్టర్ శ్రీకాంత్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ వేణుగోపాలరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు..

పాలనలో భాగస్వామ్యం

● ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

నెల్లిమర్ల: శాసనమండలిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని, తాజాగా ప్రకటించిన 18 స్థానాల అభ్యర్థుల్లో 14 మంది ఆ కులాలకు చెందిన వారే అని ఎమ్మెల్సీ డాక్టర్ పీవీవీ సూర్యనారాయణ రాజు(సురేష్‌బాబు) చెప్పారు. మండలంలోని మొయిద గ్రామంలో బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 36 ఎమ్మెల్సీ స్థానాలను గెలుచుకోగా వాటిలో 25మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు చెందిన వారేనన్నారు. తాజాగా ప్రకటించిన 18 మంది అభ్యర్థుల్లో 11 మంది బీసీ, 2 ఎస్సీ, 1 ఎస్టీ కులాలకు చెందినవారు కావడం గమనార్హమని కొనియాడారు. తద్వారా ప్రభుత్వానికి బీసీలంటే వెనకబడిన తరగతుల వారు కాదని, బ్యాక్ బోన్ అనే నినాదాన్ని జగన్ రుజువు చేశారన్నారు. ప్రభుత్వంలోని ఐదుగురు ఉప ముఖ్యమంత్రుల్లో నలుగురు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు చెందినవారని ఎమ్మెల్సీ వివరించారు. టీడీపీ హయాంలో చంద్రబాబు బీసీలను ఓటు బ్యాంకుగా వినియోగించుకుని, ఎటువంటి ప్రాధాన్యం ఇవ్వకుండా వదిలేశారని ఆరోపించారు.

సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు

తనకు రెండోసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తూ ఎమ్మెల్యే కోటాలో అభ్యర్థిగా ప్రకటించిన జగన్‌మోహన్ రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. తనను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించడంలో పార్టీ ఉత్తరాంధ్ర పరిశీలకుడు, టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఇతర ఎమ్మెల్యేలు ఎంతగానో సహకారం అందించారంటూ అందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్సీ సురేష్‌బాబు చెప్పారు.